RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com


## సూర్యుడిపై అధ్యయనంలో కీలక ఘట్టం

**ఆదిత్య-ఎల్ 1లో రికార్డయిన సౌరగాలులు - ఫొటో షేర్ చేసిన ఇస్రో**

బెంగళూరు- ప్రభాత సూర్యుడు

సూర్యుడిపై అధ్యయ నంలో కీలక ఘట్టం చోటుచేసుకున్నది. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య-ఎల్ 1 తన ప్రయాణంలో మరో మైలురాయిని అందుకుంది.

మిగతా 2లో



RANGAREDDY, EDITION : 01, VOLUME :198 EDITOR: CHERUKU UPENDAR, DATE : SUNDAY 03 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 198 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 03 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

### ప్రజా సమస్యలపై
## సవివరమైన చర్చ

- అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు డిమాండ్
- నిర్మాణాత్మక చర్చకు ప్రభుత్వం సిద్ధం
- రేపటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు
- పార్లమెంట్ ముందుకు 21 బిల్లులు..



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో సవివరమైన చర్చ జరగాలని అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత, రేపటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభంకానున్నాయి. డిసెంబర్ 4 నుంచి 22 వరకు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి.

మిగతా 2లో

# నేడే ప్రజా తీర్పు

- ఉదయం 8 నుంచి ఓట్ల లెక్కింపు
- 10 గంటలకల్లా తొలి ఫలితం ఆద్యంతం ఉత్కంఠ
- జయాపజయాలపై ఎవరి ధీమా వారిదే
- ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఓటరు తీర్పు ఈవీఎమ్ యంత్రాల్లో నిక్షిప్తమై ఉంది. వాటిని వెల్లడించే సమయం వచ్చేసింది. ఆదివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 119 నియోజవర్గాల ఓట్ల లెక్కింపు 49 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లలో జరుగుతుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. మూడంచెల భద్రత మధ్య ఉన్న స్ట్రాంగ్ రూంల నుంచి ఈవీఎమ్‌లను కౌంటింగ్ కేంద్రాలకు చేర్చారు. ఆదివారం ఉదయం రాజకీయపార్టీల ఏజెంట్ల సమక్షంలో ఆయా ఈవీఎమ్‌ల సీళ్లను విప్పి, కౌంటింగ్‌ను ప్రారంభిస్తారు. ఒక్కో ఈవీఎమ్‌లోని ఓట్లను అభ్యర్థుల వారీగా రెండుసార్లు లెక్కిస్తారు. కౌంటింగ్ కోసం మొత్తం 1,798 టేబుళ్లను ఏర్పాటు చేశారు. వీటిపై 2,417 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. తొలి ఫలితం ఉదయం 10 గంటలకే వెల్లడి అవుతుంది. 11 గంటలకల్లా పార్టీల ట్రెండ్ తెలిసిపోతుంది. మేడ్చల్, ఎల్‌బీ నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు కోసం 28

మిగతా 2లో

## మళ్లీ బాంబుల మోత..

**178 మంది మృతి**

**15 వేలు దాటిన మరణాలు : పాలస్తీనా వెల్లడి**



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఇజ్రాయెల్ సైన్యం గాజాపై మళ్లీ దాడులు ప్రారంభించింది. వారం రోజుల కాల్పుల విరమణ అనంతరం ఇజ్రాయెల్ శుక్రవారం ఉదయం నుంచే దాడులు ప్రారంభించింది. మళ్లీ మొదలైన ఈ దాడుల్లో 178 మంది మృతి చెందారని, దాదాపు 589 మందికి గాయపడ్డారని గాజాలోని హమాస్ నియంత్రిత ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. అయితే తాజా దాడులకు హమాస్‌నే కారణమని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఆరోపించింది. హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై క్షిపణులు ప్రయోగించారు. దీంతో మళ్లీ దాడులు ప్రారంభించడం జరిగింది అని ఐడీఎఫ్ శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా పేర్కొంది. ఇజ్రాయెల్- హమాస్ సంధి ప్రకారం.. నవంబర్ .

మిగతా 2లో

## కౌంటింగ్‌కు అంతా సిద్ధం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కౌంటింగ్ కేంద్రాల దగ్గర మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌లో 14 చోట్ల కౌంటింగ్ జరుగుతుంది. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ పోస్టల్ ఓట్ల కౌంటింగ్.. ఎనిమిదిన్నర నుంచి ఈవీఎంల లెక్కింపు ఉంటుందని వికాస్ రాజ్ చెప్పారు. తెలంగాణలో మొత్తం 71.06శాతం పోలింగ్ జరిగిందన్నారు. మునుగోడులో అత్యధికంగా 91.5 శాతం పోలింగ్ నమోదు



## కృష్ణాజలాల వివాదంపై 6న కీలక సమావేశం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కృష్ణాజలాల వివాదంపై చర్చించేందుకు ఆరవ తేది (బుధవారం) ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కేంద్ర జలవనరుల శాఖ నిర్ణయించింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరుకావాలని ఆదేశించింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఇప్పటికే కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం రాత్రికే ప్రాజెక్టు వద్దకు

మిగతా 3లో




## రంగంలోకి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ

- అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండాలని ఆదేశం
- హైదరాబాద్‌కు ఢిల్లీ నేతలు
- కౌంటింగ్ సరళిని పరిశీలించనున్న నేతలు
- సీఎం కేసీఆర్ కుట్రలకు యత్నం
- అభ్యర్థులతో కేసీ వేణుగోపాల్ జూమ్ మీటింగ్
- ఈసీకి కాంగ్రెస్ వినతి


హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఆదివారం అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో . రంగంలోకి దిగారు. అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండాలని ఆయన ఆదేశించారు. గెలిచిన వెంటనే అభ్యర్థులు హైదరాబాద్‌కు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ పార్టీ నేతలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు సూచించినట్టు తెలుస్తోంది. కౌంటింగ్‌కు ముందు అభ్యర్థులు ఎవరూ చేజారకూడదనే ఉద్దేశంతో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉండేందుకు అధిష్ఠానం చర్యలు చేపట్టింది. నగరంలోని హొటల్ తాజ్‌కృష్ణలో అభ్యర్థులకు ఏఐసీసీ ప్రతినిధులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఆదివారం ఉదయం ఆయన హైదరాబాద్‌కు చేరుకుంటారు. కౌంటింగ్ సరళిని పరిశీలించేందుకు ఏఐసీసీ సీనియర్ నేతలు పి చిదంబరం, సుశీల్‌కుమార్‌షిండే, సూర్జేవాలాను హైదరాబాద్‌కు ఇప్పటికే పంపించారు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి రానుందన్న వార్తల నేపథ్యంలో ఆ పార్టీ అప్రమత్తమైంది. తమ అభ్యర్థులపై సీఎం



కేసీఆర్ కుట్రలు చేస్తున్నట్టు డీకే శివకుమార్ అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు జరగనున్న 49 కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పరిశీలకులను ఏఐసీసీ నియమించింది. అభ్యర్థులు, పర్యవేక్షకులు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎదురయ్యే సాంకేతిక అంశాలపై వివరించారు. అప్పటివరకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సూచించారు. ఎన్నికల ఏజెంట్‌కు ఎమ్మెల్యే ధ్రువపత్రం ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను కలిసి కోరారు. అయితే అలాంటి వెసులుబాటు ఏదీ లేదని వికాస్ రాజ్ వారికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

### 66 శాతం మలేరియా కేసులు
## భారత్‌లోనే



న్యూయార్క్- ప్రభాత సూర్యుడు

: 2022లో ఆగేయాసియా ప్రాంతంలో 66శాతం మలేరియా కేసులు భారతదేశంలేనే నమోదు అయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రచురించిన ప్రపంచ మలేరియా నివేదిక %--% 2023లో పేర్కొంది. వీటిలో దాదాపు 46శాతం ప్లాస్మోడియం వైవాక్స్ వల్ల సంభవించాయని తెలిపింది. దోమ తెరలు, మందులు వినియోగించడం ద్వారా చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీల్లో మలేరియాను నివారించడంలో సహాయపడతాయని తెలిపింది. ఆగేయాసియా ప్రాంతంలో 77శాతం మరణాలు తగ్గాయని తెలిపింది. కాగా ఆగేయాసియాలోని మొత్తం మలేరియా మరణాల్లో 94శాతం మరణాలు భారత్, ఇండోనేషియాలో ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 2019లో 233 మిలియన్ల మలేరియా కేసులు నమోదు

మిగతా 2లో

# సూర్యుడిపై అధ్యయనంలో కీలక ఘట్టం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఉపగ్రహంలోని ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్ తన ఆపరేషన్స్‌ను ప్రారంభించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో వెల్లడించింది. ఈ పేలోడ్‌లోని రెండు పరికరాలు పరిశోధనలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని, ఇవి సౌర గాలులను అధ్యయనం చేస్తున్నాయని తెలిపింది. ఈ ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్‌లో రెండు పరికరాలున్నాయి. ఇందులోని సూపర్‌థర్మల్ అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్‌ను సెప్టెంబరు 10న, సోలార్ విండ్ అయాన్ స్పెక్ట్రోమీటర్‌ను నవంబరు 2న యాక్టివేట్ చేశారు. ఈ రెండు తమ కార్యకలాపాలను సజావుగా సాగిస్తున్నాయని ఇస్రో తెలిపింది. స్విస్‌లో ఉన్న రెండు సెన్సర్లు 360 డిగ్రీల్లో తిరుగుతూ పనిచేస్తున్నాయి. ఇవి నవంబరులోని రెండు తేదీల్లో సోలార్ విండ్ అయాన్లు, ప్రైమరీ ప్రోటాన్స్, ఆల్ఫా పార్టికల్స్‌ను విశ్లేషించినట్లు ఇస్రో తెలిపింది. ఈ సెన్సర్ సేకరించిన ఎనర్జీ హిస్టోగ్రామ్‌ను పరిశీలించిన తర్వాత.. ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్స్‌లో కొన్ని వైవిధ్యాలు ఉన్నట్లు గుర్తించామని ఇస్రో పేర్కొంది.

# మళ్లీ బాంబుల మోత..

(మొదటిపేజీ తరువాయి)

24-30 తేదీ వరకు 80 మంది ఇజ్రాయిలీలు, 24 మంది విదేశీపౌరులను హమాస్ విడుదల చేయగా.. 240 మంది పాలస్తీనా ఖైదీదలను ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసింది. అయితే గాజాలో 17 మంది మహిళలు, పిల్లలతో సహా 136 మంది బంధీలుగా ఉన్నారని ఐఎడిఎఫ్ తెలిపింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ సైన్యం గాజాలోని నివాస ప్రాంతాలపై దాడులు కొనసాగిస్తోంది. కాగా, యుద్ధం ప్రారంభం నుంచి ఇప్పటివరకు గాజాలో 15,200 మంది మృతి చెందినట్టు గాజా ఆరోగ్య విభాగం వెల్లడించింది. చనిపోయినవారిలో మూడింట రెండొంతులు మహిళలు, చిన్నారులేనని తెలిపింది. మరో 40 వేలమంది పౌరులు గాయపడినట్లు ప్రకటించింది. అక్టోబరు 7న హమాస్ మెరుపు దాడులకు ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోన్న విషయం తెలిసిందే.

# కౌంటింగ్‌కు అంతా సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కాగా.. యాకుత్‌పురాలో అత్యల్పంగా 39.6శాతం పోలింగ్ నమోదైనట్లు వికాస్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం లేదని సీఈఓ తెలిపారు. ఆదివారం జరిగే కౌంటింగ్ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తెలంగాణ అంతటా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని.. 3కోట్ల 26లక్షల ఓట్లు కాగా పురుషుల కంటే మహిళల ఓట్లు ఎక్కువ ఉన్నాయని వెల్లడించారు. దేవరకద్రలో 10మంది ఉన్నా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం ల మార్పిడి జరిగిందని.. ఆయా పార్టీ ఎజెంట్ల మధ్యనే స్ట్రాంగ్ రూమ్ కి తరలింపు జరిగిందని తెలిపారు. పోలింగ్ పై స్క్రూటినీ శుక్రవారం ఉదయం నుంచి జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని.. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 40 కేంద్ర కంపెనీల బలగాలు భద్రతలో ఉన్నాయన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువ పోలింగ్ శాతం నమోదు అయిందన్నారు.లెక్కింపు జరిగిన కూడా మళ్ళీ రెండు సార్లు ఈవీఎం లు లెక్కిస్తారన్నారు. ప్రతీ రౌండ్ కు సమయం పడుతుంది.. ఇఅఎ నిబంధనల ప్రకారం జరుగుతుందని వివరించారు. 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లతో కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. 8.30 నిమిషాల నుంచి ఈవీఎం ల లెక్కింపు ఉంటుందని.. ప్రతి టేబుల్ కు 5 గురు ఉంటారు.. కౌంటింగ్ కోసం పూర్తిగా సిద్ధం అవుతున్నమన్నారు.

# 66 శాతం మలేరియా కేసులు భారత్‌లోనే


(మొదటిపేజీ తరువాయి)

కాగా, 2022లో 249 మిలియన్ కేసులు చేరుకున్నాయి. 2019 కంటే 2022లో 16 మిలియన్ కేసులు పెరిగాయని నివేదిక పేర్కొంది. కోవిడ్-19, మాదకద్రవ్యాలు మరియు పురుగుమందుల నిరోధకత, మానవతా సంక్షోభాలు, వనరుల పరిమితులు, వాతావరణ మార్పుల ప్రభావాలు వంటివి మలేరియాపై పోరాటానికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొంది. 2016 నుండి నేటి వరకు శ్రీలంక మలేరియా రహిత దేశంగా కొనసాగుతుందని పేర్కొంది.

## యువగళం ముగింపు సభకు
# చంద్రబాబు, పవన్ కల్యాణ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర డిసెంబరు 17తో ముగియనుంది. భీమిలి నియోజకవర్గంలో యువగళం ముగింపు సభను భారీ ఎత్తున నిర్వహించనున్నారు. ఈ సభకు టీడీపీ అధినేత



చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. ఈ మేరకు టీడీపీ విశాఖ పార్లమెంటు స్థానం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. యువగళం పాదయాత్ర డిసెంబరు 6న అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేటకు చేరుకుంటుందని, పాయకరావుపేట 7న మొదలయ్యే యువగళం డిసెంబరు 17తో సమాప్తం అవుతుందని పల్లా శ్రీనివాసరావు వివరించారు. నారా లోకేశ్ జనవరి 27న కుప్పంలో యువగళం పాదయాత్ర షురూ చేశారు. 4 వేల కిలోమీటర్లు, 400 రోజుల పాటు పాదయాత్ర సాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మధ్యలో చంద్రబాబు అరెస్ట్ కావడంతో యువగళానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇటీవలే లోకేశ్ యువగళాన్ని పునఃప్రారంభించారు.

# నేడే ప్రజాతీర్పు

(మొదటిపేజీ తరువాయి)

టేబుళ్లు ఏర్పాటు చేశారు. పెద్ద నియోజకవర్గాల్లో త్వరగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు ఎన్నికల సంఘం ఈ ఏర్పాట్లు చేసింది. 99 నియోజకవర్గాల్లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. షాద్ నగర్ నియోజకవర్గంలో 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఖమ్మం, కోదాడ నియోజకవర్గాల్లో 16 టేబుళ్లు, తుంగతుర్తి, హుజూర్‌నగర్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించారు. గెలుపొందిన అభ్యర్థుల విజయ యాత్రల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని డీజీపీ అంజన్‌కుమార్ పోలీసు అధికారుల్ని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలు, ఆ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో గెలుపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్లకు ఎలాంటి భద్రత కల్పించకుండా, ఓపెన్‌గా పడేశారంటూ శనివారం రాత్రి కాంగ్రెస్ నేతలు ఆందోళనలకు దిగారు. 29వ తేదీ వేసిన పోస్టల్ బ్యాలెట్లను స్ట్రాంగ్ రూములకు పంపలేదనీ, కనీసం ఆ బాక్సులకు సీల్ కూడా వేయలేదని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. దీనితో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

కౌంటింగ్ ఇలా%ా

%స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. 40 కంపెనీల కేంద్ర బలగాలు భద్రతా విధుల్లో ఉన్నారు. సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సెంటర్లలో 1,798 లెక్కింపు టేబుళ్లు, 131 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. హౌం ఓటింగ్ బ్యాలెట్లను కూడా పోస్టల్ బ్యాలెట్లతో కలిపే లెక్కిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉంటే రెండింటి కౌంటింగ్ సమాంతరంగా జరుగుతుంది. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులు ఉంటారు. 49 కౌంటింగ్ కేంద్రాల్లో 119 మంది టెక్నికల్ ఇంజినీర్లు కూడా అందుబాటులో ఉంటారు.

**డీఏ విడుదలకు ఈసీ అనుమతి**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) విడుదలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి ఇచ్చింది. ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఒక డీఏ విడుదలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి విజ్ఞప్తి చేసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఈసీ మధ్య సంప్రదింపులు జరిగాయి. డీఏల చెల్లింపు ఆలస్యానికి కారణాలు, గతంలో డీఏల చెల్లింపు విధానాలపైనా ఈసీ ఆరా తీసింది. ఉద్యోగ సంఘాలు కూడా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రాలు పంపాయి. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేసేందుకు ఈసీ అనుమతి ఇచ్చింది.

ఆ రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి

న్యూఢిల్లీ : మూడు రాష్ట్రాల్లో ఓట్లలెక్కింపునకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. మధ్యప్రదేశ్‌లో 230, రాజస్థాన్‌లో 199, ఛత్తీస్‌గఢ్‌లో 90 స్థానాలకు ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవు తుంది. మిజోరం కౌంటింగ్‌ను ఆ రాష్ట్రం నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు సోమవారానికి ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, బిజెపి మధ్య ప్రధాన పోటీ నెలకొంది.



**నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు**

శాసన సభ ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి.. ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ మొత్తం సీసీ కెమెరాల నిఘాలో పోలీసు బందోబస్తు మధ్యలో జరగనుంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేయనున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగారెడ్డి జిల్లాలో 209, వికారాబాద్ జిల్లాలో 61 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయి. గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ఉంటుంది. గండిపేట పరిధిలోని అప్ప జంక్షన్ లార్డ్ ఇంజినీరింగ్ కాలేజీలో రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇబ్రహీంపట్నం పరిధిలోని సీవీఆర్ కాలేజీలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డులో వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూర్ నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 8 నియోజకవర్గాలను 166 టేబుల్స్‌పై ఈవీఎంలు, 51 టెబుల్స్‌పై పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుంది. వికారాబాద్ జిల్లాలోని 4 నియోజకవర్గాలను 56 టెబుల్స్‌పై ఈవీఎంలు, 13 టెబుల్స్‌పై పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 10గంటల 30 నిమిషాలకు మొదటి ఫలితం రానుంది. రంగారెడ్డి జిల్లాలో 1085 మంది, వికారాబాద్ జిల్లాలో 426 మంది చొప్పున సిబ్బంది లెక్కింపు ప్రక్రియలో పాల్గొంటారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఇందులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్స్ స్థాయి ఉద్యోగులు కౌంటింగ్ కేంద్రాల్లో ఉండనున్నారు.

వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ గోదాంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. అందరూ తప్పకుండా ఉదయం ఐదు గంటల్లోపు కేంద్రానికి ఐడీ కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఇబ్రహీంపట్నం సీవీఆర్ కాలేజీని రాచకొండ సీపీ చౌహాన్ పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లు, బందోబస్తు నిర్వహణపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భువనగిరి పట్టణంలోని అరోరా ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ చేయనున్నారు. భువనగిరి నియోజకవర్గంలో 257 బూతులు 14 టేబుల్స్ 19 రౌండ్లు చేయనున్నారు. ఒక్కొక్క రౌండ్‌కు 14 బూత్‌ల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఆలేరు నియోజకవర్గంలో 309 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 14 టేబుల్ 23 రౌండ్లు కౌంటింగ్ చేయనున్నారు.

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలో గల గోదాముల్లో జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుంది. ప్రతి నియోజకవర్గానికీ 14 కౌంటింగ్ టేబుల్లు, ఒక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ ఏర్పాటు చేశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నాలుగు నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్స్‌తో పాటు కౌంటింగ్‌హాల్స్ ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్ 308 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్స్, కోదాడ 296 పోలింగ్‌కేంద్రాలకు 22 రౌండ్స్, సూర్యాపేటలోని 271 పోలింగ్‌కేంద్రాలకు 20 రౌండ్స్, తుంగతుర్తిలోని 326 పోలింగ్‌కేంద్రాలకు 24 రౌండ్స్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం హుజూర్‌నగర్ కౌంటింగ్‌హాల్‌కు 4 టేబుల్స్, కోదాడకు 5 టేబుల్స్, సూర్యాపేటకు 6 టేబుల్స్, తుంగతుర్తికి 3 టేబుల్స్ మొత్తం 18 టేబుల్స్ ఏర్పాటు చేశారు.

**ఖమ్మంలో..**

ఖమ్మం జిల్లాలో ఐదు నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ వద్ద శ్రీ చైతన్య కళాశాలలో జరగనుంది. శనివారం కలెక్టర్ విపి గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్ పరిశీలించారు. ఖమ్మం, పాలేరు నియోజక వర్గానికి ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్నందున లెక్కించేందుకు కొంచెం ఎక్కువ సమయం పడు తుందని చెప్పారు. ఖమ్మం నియోజకవర్గంలో 25 రౌండ్లు, పాలేరులో 20, మధిరలో 19, వైరాలో 18, సత్తుపల్లిలో 20 రౌండ్లు ఉంటాయి. మొత్తం 14టేబుల్స్ కాగా ప్రతి అరగంటకు ఒక టేబుల్ ఫలితం విడుదల చేయనున్నారు.

**భద్రాద్రి జిల్లాలో 82 రౌండ్లు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వరావుపేట, భద్రాచలం, కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓట్లు లెక్కింపు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్క టేబుల్‌కు 14 పోలింగ్ స్టేషన్లు కేటాయించారు. వాటి పర్యవేక్షణకు 18 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌ను నియమిం చారు. ఓట్ల లెక్కింపును వీక్షించేందుకు కళాశాల ఆవరణలో ఎల్ఈడి టీవీని ఏర్పాటు చేశారు.

# ప్రజా సమస్యలపై సవివరమైన చర్చ

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 19 రోజుల పాటు సాగనున్న ఈ సెషన్ లో 15 రోజులు ఉభయ సభలు భేటీ కానున్నాయి. ఈ సెషన్ లో మొత్తం 21 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. అందులో రెండు ఫైనాన్షియల్ బిజినెస్‌కు సంబంధించిన బిల్లులను తీసుకురానుంది. ఈ నేపథ్యంలో శనివారం పార్లమెంట్ లైబ్రరీ భవన్‌లో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ సమావేశానికి 23 పార్టీల నుంచి 30 మంది నేతలు హాజరయ్యారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాల నిర్వహణపై అఖిలపక్ష నేతలతో కేంద్రం చర్చించింది. శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం తరపున ప్రవేశపెట్టే బిల్లుల వివరాలు అఖిలపక్ష నేతలకు కేంద్రం అందించింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, బిజెపియేతర రాష్ట్రాల పట్ల ఆర్థిక వివక్షపై సవివరంగా చర్చించాలని ప్రతిపక్షాలు కోరాయి.. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌కి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులకు హిందీలో పేర్లు పెట్టడంపై అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఐపిసికి బదులుగా భారతీయ న్యాయ సంహిత, సిఆర్‌పిసికి బదులుగా భారతీయ సివిల్ ప్రొటెక్షన్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్‌కు బదులుగా భారతీయ సాక్ష్యా అధినియం అని పేరు పెట్టారు. ఈ చర్యను దక్షిణ భారతదేశంలోని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సాధారణంగా బిజెపి అనుకూల వైఖరిని అవలంబించే అన్నాడిఎంకె కూడా నిరసనలో భాగస్వామ్యం అయింది. కేంద్ర ప్రభుత్వం తరపున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ఈ సమావేశంలో పాల్గొనగా, కాంగ్రెస్ తరపున జైరాం రమేష్, ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగోరు, టిఎంసి నుంచి సుదీప్ బంద్యోపాధ్యాయ, డెరెక్ ఓ'బ్రియన్, డిఎంకె ఎంపి విల్సన్, జెఎంఎం నుంచి మహువా మజీ, ఎస్పి నుంచి ఎస్‌టి హసన్, బిఎస్పీ ఎంపి గిరీష్ చంద్ర, జెడియు నేత దిలేశ్వర్ కామత్, ఎన్సీపీ ఎంపి ఫౌజియా ఖాన్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి ఎన్ డి గుప్తా, సిపిఎం ఎంపి ఎలమరం కరీం, సంతోష్ కుమార్ (సిపిఐ), అగాథా సంగ్మా (ఎన్పిపి), ఎన్ కె ప్రేమచంద్రన్ (ఆర్ఎస్పి), నామా నాగేశ్వరరావు (బిఆర్ఎస్), కనకమేడల రవీంద్ర కుమార్ (టిడిపి) తదితరులు హాజరయ్యారు.

**సభ ముందుకు 21 బిల్లులు**

ఈ పార్లమెంట్ సమావేశాల్లో మొత్తం 21 బిల్లులు సభ ముందుకు రానున్నాయి. అందులో 19 సాధారణ బిల్లులు కాగా, రెండు ఆర్థిక బిల్లులు ఉన్నాయి. భారతీయ న్యాయ సంహిత బిల్లు 2023, భారతీయ నా%ూఎఅశ్రీఖజుఖఎంష్టుఎ%గరిక్ సురక్ష సంహితా బిల్లు 2023, భారతీయ సాక్ష్యా బిల్లు 2023 బిల్లు, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, మహిళా రిజర్వేషన్ చట్టంలోని నిబంధనలను జమ్మూ కాశ్మీర్, పుదుచ్చేరికి విస్తరించడానికి రెండు, సెంట్రల్ యూనివర్శిటీ సవరణ బిల్లు, పోస్టాఫీసు సవరణ బిల్లు, రాజ్యసభలో ఆమోదం పొందిన అడ్వకేట్స్ (సవరణ) బిల్లు, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పిరియాడికల్స్ బిల్లులను జాబితా చేసింది. జమ్మూకాశ్మీర్ కు సంబంధించిన నాలుగు బిల్లులను ఉభయ సభల ముందుకు తీసుకురానుంది. ఇందులో జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్(సవరణ) బిల్లు, జమ్మూ కాశ్మీర్ రీఆర్గనైజేషన్ (సవరణ) బిల్లు, జమ్మూకాశ్మీర్ ఎస్సీ, ఎస్టీ ఆర్డర్ సవరణ బిల్లులు ఉన్నాయి. ప్రొవిజినల్ కలెక్షన్ ఆఫ్ టాక్సెస్, నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ లా (స్పెషల్ ప్రొవిజన్స్) రెండో సవరణ బిల్లు వంటివి ఉన్నాయి. అలాగే 2023-24 కి సంబంధించిన డిమాండ్స్ గ్రాంట్స్, 2020-21 డిమాండ్స్ ఫర్ ఎక్సెస్ గ్రాంట్స్ వంటి ఫైనాన్షియల్ బిజినెస్ పై చర్చ చేపట్టనున్నారు.

### సంపాదకీయం

## ఎన్నికలలో డబ్బు మద్యమే...!

ఎన్నికల్లో నిబంధనల పరిమితికి మించి ఖర్చు పెట్టరాదని, ప్రధానంగా డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభ పెట్టరాదని స్పష్టంగా రాజకీయ నేతలతో పాటు ప్రజలకు కూడా తెలుసు. కానీ అవి లేకుండా ఎన్నికల్లో విజయం సాధించలేమనే వాస్తవం కూడా నేతలకు తెలియంది కాదు. అందుకే ఎన్ని అక్రమాలకు పాల్పడి అయినా మరెన్ని అడ్డదారులు తొక్కి అయినా విజయాన్ని సాధించాలనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో ఈ పార్టీ, ఆ పార్టీ అనికాదు. ఎవరి శక్తిమేరకు ఎక్కడ అవకాశాలుంటే అక్కడ నిబంధనలను తుంగలో తొక్కి డబ్బును మంచినీరులా ఖర్చుపెడుతున్నారు. మద్యాన్ని ఏరులా పారిస్తున్నారు. ఐదు రాష్ట్రాల్లో అధికారికంగా ఈసీ లెక్కల ప్రకారమే 1900 కోట్లుగా ఉంది. ప్రస్తుతం దేశంలో తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మిజోరం శాసనసభలకు జరుగుతున్న ఎన్నికల్లో ఇప్పటికే పెడుతున్న ఖర్చు ఊహలకు అందడం లేదు. ఇప్పటివరకు తెలంగాణలోనే దాదాపు రూ. 780 కోట్లకు పైగా విలువ కలిగిన మద్యం, చీరలు, బంగారం, డబ్బు పట్టుబడింది. ఇవి పోలీసుల తనిఖీల్లో పట్టుబడినవి మాత్రమే! అయితే, పట్టుబడింది సరఫరా అవుతున్న దాంట్లో పదోవంతు కూడా ఉండకపోవచ్చునని అంటున్నారు. నిజానికి శాసనసభ నియోజకవర్గంలో ఒక్కొక్క అభ్యర్థి పెట్టే ఖర్చుపై నలభై లక్షల పరిమితి ఉంది. అంతకుమించి వెచ్చించడానికి చట్టం అంగీకరించదు. కానీ అభ్యర్థులు పెడుతున్న వ్యయం ప్రజాస్వామ్య వాదుల్లో విస్మయం కలిగిస్తున్నది. దాదాపు ప్రతి నియోజకవర్గంలో కనిష్టంగా పదికోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నట్టు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అసలు ఇది ప్రజాస్వామ్యమా? పైసలస్వామ్యమా? ఒకపక్క కోట్లాది రూపాయలు పట్టుబడుతున్నప్పటికీ, మరొకపక్క జంకు బొంకు లేకుండా నిరాటంకంగా పంపిణీ కార్యక్రమాలు జరిగిపోతున్నాయి. బుజ్జగింపుల పర్వంలో కూడా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఎన్ని హెచ్చరికలు చేసినా, మరొకపక్క ఆకస్మిక దాడులు నిర్వహించి మద్యం, డబ్బు స్వాధీనం చేసుకొని కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నా ఇవేమీ ఆగడం లేదు. అసలు పోలీసులన్నా, చట్టాలన్నా భయం లేకుండా పోతుంది. అందుకు చట్టాల్లోని లొసుగులు, కొందరు అవినీతి అధికారుల చేతి వాటమే కారణం కావచ్చు. ఎన్ని కోట్ల రూపాయలు పట్టుబడుతున్నా, కేసులు నమోదవుతున్నా శిక్షలు వేయించడంలో దర్యాప్తు అధికారులు విఫలమవుతున్నారని చెప్పొచ్చు. 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 1649 కేసులు నమోదుకాగా అందులో శిక్ష పడింది వందలోపు కేసులకు మాత్రమే. న్యాయ విచారణలో ఎన్నో వందలాది కేసులు నేటికీ పెండింగ్‌లో ఉండగా, మరికొన్ని దర్యాప్తు దశలోనే కొనసాగుతున్నాయి. ఓటర్లను ప్రలోభపెట్టాలనుకున్నా, రెచ్చగొట్టేలా ప్రచారం చేసినా వాటికి చట్టంలో శిక్షలు ఉన్నాయి. కానీ వాటిని ఏమాత్రం పాటించరు! రాజకీయ సభలు నిర్వహించాలంటే కోట్లల్లో ఖర్చు పెట్టాల్సిందే. ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యం. కానీ వారిపై తీసుకున్న చర్యలను పరిశీలిస్తే, ఎలక్షన్ కమిషన్ సామర్థ్యం ఏమిటో చెప్పకనే చెబుతున్నది. అందుకే ఈ డబ్బు, మద్యం పంపిణీ ఏడాదికేడాది పెరిగిపోతున్నది. ఇది ఒక్క తెలంగాణలోనే కాదు.. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో అన్నిపార్టీలు కలిసి దాదాపు రూ.35 వేలకోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అధికార అంచనాలే చెబుతున్నాయి. 2019 ఎన్నికలు వచ్చేసరికి అది రూ. 50 వేల కోట్లకుపైగా చేరుకున్నదని అంచనా. ఈ లెక్కన వచ్చే ఎన్నికలకు ఖర్చు లక్ష కోట్లకు చేరినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల్లో ఇలా ఖర్చు పెట్టడం, తిరిగి సంపాదించుకోవడంలో కూడా నేతలు పోటీ పడుతున్నారు. అందుకే కొందరు రాజకీయ నాయకుల ఆస్తులు అంచనాలకు మించి వందల రెట్లు పెరుగుతున్నాయి. ఫలితంగా ఎన్నికల ప్రక్రియ ఒక మిథ్యగా మారిపోతున్నదని ప్రజాస్వామ్య వాదుల ఆందోళన. ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలు ప్రాణం వంటివి. కానీ అవి వ్యాపారంగా మారి ఖరీదైపోయాయి. ఓట్లకు వెల కట్టే దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఈ ఎన్నికలకు ఎన్నికల కమిషనే ఊపిరి. అందుకే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా రాగద్వేషాలకు అతీతంగా స్వతంత్ర ప్రతిపత్తి హోదాతో ఎన్నికల కమిషన్ సమర్థవంతంగా పని చేయగలిగితే కొంతవరకైనా ప్రజాస్వామ్యం పరిరక్షింపబడుతుంది. ఇలాగే కొనసాగితే పైసలస్వామ్యంగా మారిపోక తప్పదు.

## మానస' లో దివ్యాంగుల దినోత్సవం

**చైతన్యపురి- ప్రభాత సూర్యుడు :** మానస చిన్నారుల ఆరోగ్య, వైకల్యాల అధ్యయన సంస్థలో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం 'దివ్యాంగుల కోసం ఐక్యరాజ్య సమితి నిర్దేశిత సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ పౌష్ఠిక ఆహార సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డా. భానుప్రకాష్ రెడ్డి హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు సమాన హక్కులు ఉన్నాయని, వారిని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో సమ్మిళితం చేయాలని పేర్కొన్నారు. తనకు స్వయంగా శారీరక వైకల్యం ఉన్నప్పటికీ తన కుటుంబం, మిత్రుల సహకారం కారణంగా జీవితంలో, ఎంచుకొన్న వృత్తిలో ఎదగటానికి వైకల్యం అడ్డురాలేదని వివరించారు. శారీరక దివ్యాంగులు కొంతవరకు తమ అవసరాలను గుర్తించి అడగ గలుగుతారని అయితే మానసిక దివ్యాంగులకు తమ అవసరాలపై సైతం అవగాహన ఉండకపోవచ్చని, అలాంటి మానసిక దివ్యాంగులపై మరింత ప్రత్యేక శ్రద్ధ, వారికోసం సంపూర్ణ సమాజ చేయూత అవసరమని పేర్కొన్నారు. ప్రణవ్ ఎంటర్ప్రైజెస్ ప్రొప్రయిటర్ ఎం. ఎస్. చంద్రకాంత్ సాగర్ మాట్లాడుతూ తనకు పుట్టుకతోనే తీవ్ర అంగవైకల్యం ఉన్నప్పటికీ ఏడు సంవత్సరాల వయస్సులో హాస్టల్‌లో చేరి, 22 సంవత్సరాల వయస్సులో ఇద్దరు ఉద్యోగులతో చిన్న సంస్థ ఏర్పాటు చేసానని, నేడు తనవంటి దివ్యాంగుల కొందరికి ఉద్యోగ అవకాశం కల్పించడం సంతృప్తికరంగా ఉందని ఆనందర వ్యక్తం చేశారు.

# కృష్ణాజలాల వివాదంపై 6న కీలక సమావేశం

(మొదటిపేజీ తరువాయి)
చేరుకున్న సిఆర్‌పిఎఫ్ దళాలు, శనివారం డ్యామ్ మొత్తాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ఆరవ తేది నిర్వహించనున్న సమావేశంలో కృష్ణా జలాల వివాదం, సాగర్, శ్రీశైలం డ్యామ్‌ల నిర్వహణ కృష్ణా నదీజలాల యాజమాన్య బోర్డుకు అప్పగించడం తదితరఅంశాలపై చర్చించనున్నారు. శనివారం నాడు కూడా ఇవే అంశాలపై రెండు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. దాదాపు గంటపాటు జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మినహా ఇరు రాష్ట్రాటలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎన్నికలు జరగడం, కౌంటింగ్ ఏర్పాట్లలో అధికారయంత్రాంగం నిమగం కావడం తదితర కారణాల రీత్యా ఐదవ తేది సమావేశాన్ని నిర్వహించాలని ఆయన కోరారు. దీంతో ఆరవతేది సమావేశాన్ని నిర్వహిస్తామని జలవనరుల శాఖ కార్యదర్శి ముఖర్జీ అన్నారు. అప్పటి వరకూ ఇరు రాష్ట్రాలు పూర్తి సంయవనం పాటించాలని సూచించారు. నీటి విడుదలకు సంబంధించి ఎపి ఇచ్చిన ఇండెంటుపై సోమవారం కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కెఆర్ఎంబి చైర్మన్ శివనందన్ కు ఆయన సూచించారు విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్. జవహర్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద నెలకొన్న పరిస్థితులను వివరించారు. విభజన చట్టంలో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణా వ్యవహరిస్తోందని అన్నారు. తాగునీటి అవసరాలకు నీరు విడుదలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోని కారణంగానే ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు.



### సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

### సిఆర్‌పిఎఫ్ బలగాలతోపాటు రాష్ట్ర పోలీసుల బందోబస్తు

నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. గురు, శుక్రవారాల్లో రెండు గేట్ల ద్వారా 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన రాష్ట్ర అధికారులు శనివారం ఒక గేటు ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నాల్గో రోజు కూడా ప్రాజెక్టు నిర్వహణపై వివాదం కొనసాగింది. సిఆర్‌పిఎఫ్ బలగాలు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నా కేంద్రం తుది నిర్ణయం తీసుకోకపోవడం, శనివారం జరగాల్సిన సమావేశం ఆరో తేదీకి వాయిదా పడడంతో అప్పటి వరకు బలగాలను కొనసాగించాలని ఎపి, తెలంగాణ ప్రభుత్వాలు యోచిస్తున్నాయి. కేంద్ర బలగాలతో రాష్ట్ర పోలీసు అధికారులు చర్చలు జరిపారే కానీ, యథాతథ స్థితిని కొనసాగిస్తున్నారు. 13వ గేటు వద్ద రాష్ట్ర పోలీసులు వేసిన ముళ్ల కంచెను ఇంకా తొలగించలేదు. కేంద్ర అధికారుల సందర్శన సాగర్ డ్యామ్‌ను శనివారం కెఆర్ఎంబి సభ్యులు ఎస్.సి.అశోక్ కుమార్, ఇఇ రఘునాథ్ శనివారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ వైపు ఉన్న నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించిన అనంతరం ఆంధ్ర వైపు వచ్చారు.

ఎపి, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంచాయితీపై నాగార్జున సాగర్ డ్యాం వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై కేంద్ర జలశక్తి శాఖ వీడియో కాన్ఫరెన్స్ ముగిసింది. గంటన్నరపాటు కొనసాగిన ఈ సమావేశం నిర్ణయాలను త్వరలో విడుదల చేస్తామని సిడబ్ల్యుసి చైర్మన్ వోహ్రా తెలిపారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులతోపాటు వాటి అనుబంధ ఉమ్మడి నిర్మాణ ప్రాజెక్టులను కూడా కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) పర్యవేక్షణలో కేంద్ర బలగాల పరిధిలోకి తీసుకోవాలని కేంద్ర జల వనరుల శాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. నాగార్జునసాగర్ డ్యామ్‌ను సిడబ్ల్యుసి అసిస్టెంట్ డైరెక్టర్ వివిఎన్.రావు సందర్శించి అధికారులకు కీలక సూచనలు చేశారు.

# హైదరాబాద్ నగర శివార్లో డ్రగ్స్ తయారీ

## ముగ్గురుని అరెస్టు చేసిన నార్కోటిక్ బ్యూరో

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

హైదరాబాద్ నగర శివార్లో డ్రగ్స్ తయారు చేస్తున్న ముగ్గురు నిందితులను తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీఎస్-ఎన్ఏబీ) అధికారులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 150 అసిటోన్ బాటిల్స్‌లో నిలువ ఉంచిన 60గ్రాముల క్రిస్టల్ మెథాం ఫెటమైన్, 700 ఎంఎల్ లిక్విడ్ మెథాంఫెటమైన్ డ్రగ్స్‌తోపాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.50లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్-ఎన్ఏబీ ఎస్పీ జి.చక్రవర్తి, డీఎస్పీ శ్రీధర్ మీడియాకు వివరాలు తెలిపారు. వెస్ట్ గోదావరికి చెందిన కమ్మ శ్రీనివాస్, పోలవరానికి చెందిన జి.నరసింహ రాజు, ఈస్ట్ గోదావరికి చెందిన డి.మణికంఠ వీరవెంకట నాగరాజు స్నేహితులు. ఉపాధికోసం హైదరాబాద్‌కు వచ్చిన వీరు సూరారం పరిధిలోని గాజుల రామారంలో నివాసముంటున్నారు. ప్రయివేట్ సంస్థలో పనిచేస్తున్న శ్రీనివాస్‌కు డ్రగ్స్ తయారీపై అవగాహన ఉంది. 2013లో ఓ పరిశ్రమలో డ్రగ్స్ తయారు చేస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటికి వచ్చిన



తర్వాత నరసింహరాజు, మణికంఠతో కలిసి సూరారంలో ఓ ఇంట్లో డ్రగ్స్ తయారీ చేయడం ప్రారంభించారు. రెండేండ్లుగా డ్రగ్స్ తయారు చేస్తున్న వీరు సోషల్ మీడియా ద్వారా తెలిసిన వారికి, కావాల్సిన వారికి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న నార్కోటెక్ బృందం సూరారం పోలీసులతో కలిసి ముగ్గురిని అరెస్టు చేశారు. లిక్విడ్ మెథాం ఫెటమైన్ తీసుకుని దాన్ని ప్రాసెస్ చేసి డ్రై చేస్తే క్రిస్టల్ మెథాం ఫెటమైన్ డ్రగ్ తయారవుతుందని విచారణలో నిందితులు తెలిపారు. అలా తయారు చేసిన మాదక ద్రవ్యాలను విక్రయిస్తూ భారీ మొత్తంలో డబ్బులు సంపాదించారు. నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో నార్కోటెక్ ఇన్‌స్పెక్టర్లు పి.రమేష్‌రెడ్డి, డి.సంతోష్ కుమార్, జివిఎస్ డానియల్‌తోపాటు ఎస్ఐ సీ.వెంకటరాములు తదితరులు ఉన్నారు.

# చివరి అంకం ఆసన్నం..

## మధ్యాహ్నం లోపు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం

**ఆదిలాబాద్- ప్రభాత సూర్యుడు :** ఎన్నికల క్రతువులో చివరి అంకమైన లెక్కింపు ప్రక్రియకు సమయం ఆసన్నమైంది. మరికొన్ని గంటల్లో ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. ఇందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఓట్ల లెక్కింపు కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో లెక్కించనున్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు సంబంధించి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీవీటీజీ బాలికల పాఠశాలలో లెక్కించనున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలకు సంబంధించి మంచిర్యాల జిల్లా ముల్కల్ల ఐజ ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టనున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలకు సంబంధించి నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ క్రతువులో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

### రౌండ్ల వారీగా ఫలితాలు..!

ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. మంచిర్యాల సమీపంలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజకవర్గాల ఓట్లు లెక్కించడానికి సిద్ధం చేశారు. పోలైన ఓట్లను పరిగణనలోకి తీసుకొని టేబుల్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి 14 నుంచి 20కి పైగా రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 14టేబుల్‌లు ఏర్పాటు చేయగా.. 20 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. బోథ్ లెక్కింపు కోసం 14టేబుల్‌లు ఏర్పాటు చేయగా.. 22రౌండ్లలో లెక్కింపు చేపడుతారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం లెక్కింపు కోసం 14టేబుల్‌లలో 22రౌండ్లు, సిర్పూర్ కోసం 14టేబుల్‌లను 21రౌండ్ల లెక్కింపు చేపడుతున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ లెక్కింపు కోసం 14టేబుల్‌లు ఏర్పాటుచేయగా 22 రౌండ్లలో చేపట్టనున్నారు. మంచిర్యాల నియోజకవర్గం లెక్కింపు 21 రౌండ్లలో చేపడుతారు. ఇందుకు 14టేబుల్‌లను ఏర్పాటుచేశారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల లెక్కింపు ప్రక్రియను 17రౌండ్లలో చేపట్టనుండగా ఒక్కోదానికి 14టేబుల్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి 11గంటల వరకు తొలి ఫలితం వచ్చే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. మరోపక్క లెక్కింపు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు చేస్తోంది.

# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

## ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** హైదరాబాద్ జిల్లాలో 15 నియోజక వర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో శనివారం సికింద్రాబాద్ వెస్లీ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజక వర్గం కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను ముందు గా పరిశీలించారు. అనంతరం అంబర్ పేట్ జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మలక్ పేట్ కౌంటింగ్ సెంటర్, ప్రొ.జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఉస్మా నియా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ కౌంటింగ్ సెంటర్, దోమల గూడ ఏ.వి కాలేజ్‌లో ఏర్పాటు చేసిన ముషీరా బాద్ కౌంటింగ్ సెంటర్, నారాయణగూడ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ (జి.ఎఫ్ అండ్ ఓపెన్ గ్రౌండ్) ఏర్పాటు చేసిన అంబర్ పేట్ కౌంటింగ్ సెంటర్ లను జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ పరిశీలించారు. ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ లో ఏర్పాటు చేసిన సనత్ నగర్ కౌంటింగ్ సెంటర్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యా తో కలిసి ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్ లోకి ఎవ్వరికీ సెల్ ఫోన్లు అనుమతి లేదని తెలిపారు. ఏజెంట్లు, కౌంటింగ్ నియ మించిన సిబ్బంది అందరూ ఉదయం 5 గం టల వరకు కౌంటింగ్ సెంటర్‌కు రావాలని తెలిపారు. కౌంటింగ్‌కు 14 టేబుల్ ఏర్పాటు చేయగా, మూడంచెల బందోబస్తు, మొదటి దశలో సివిల్ పోలీస్, రెండవ దశలో స్టేట్ ఆర్మీ పోలీస్, మూడవ దశలో కేంద్ర బలగాలు ఉం టాయని తెలిపారు. ఉదయం 8 గంటలకు పో స్ట ల్ బ్యాలెట్ లెక్కింపు, ఉదయం 9 గంటలకు ఈ.వీ.ఏంల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఉదయం 9:30 గంటలకు మొదటి రౌండ్ ఫలితాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మొత్తం కౌంటింగ్ పక్రీయ సాయంత్రం వరకు ముగుస్తుందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఒక్కో నియోజకవర్గానికి ఒక సాధారణ పరిశీలకులను నియమించిందని, సాధారణ పరిశీలకుల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

# కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల్లో భాగంగా, నవంబర్ 30వ తేదీన జరిగిన పోలింగ్ అనంతరం ఈనెల 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరుగునున్న కౌంటింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో కౌంటింగ్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో టేబుల్లు, కౌంటర్లు, మీడియా, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు ఇతరత్రా అన్ని ఏర్పాట్లను నిబంధనలకు లోబడి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాజర్షి షా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలకు కలిపి జిల్లా కేంద్రంలోని వైపిఆర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసి పూర్తి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ర్యాండం ప్రకారం వివి ప్యాట్లలోని స్లిప్పులు లెక్కింపు జరుగుతుందని, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# నెఫ్కాన్ వర్క్ షాపులో సాంకేతిక శాస్త్ర చికిత్సపై అవగాహన

బంజారా హిల్స్- ప్రభాత సూర్యుడు




అత్యున్నత నైపుణ్యత, అత్యాధు నిక చికిత్సా విధానాలను వెల్లడిస్తూ సాగిన ప్రతిష్టాత్మకమైన నెఫ్కాన్ 2023 (ఎన్ ఏపీసీఓఎన్) వర్క్ షాపులో శనివారం అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ అవగాహన సదస్సుకు వేదికగా నిలిచింది. ఈ సదస్సులో ముఖ్యంగా అలర్జీ చికిత్స అందించే వైద్యులు తమను సంప్రదించే ప్రతి రోగితో 10 నిమిషాల పాటు మాట్లాడి పూర్తి వివరాలను సేకరించడంతో పాటూ వారి కుటుంబంలోని మూడు తరముల చరిత్రను తెలుసుకోగలిగితే 50 నుంచి 60 శాతం అలర్జీ కేసులను ఖచ్చితంగా నిర్ధారించి తగిన చికిత్స అందించడానికి వీలవుతుందని నెఫ్కాన్ 2023 (ఎన్ఏపీసీఓఎన్) వర్క్ షాపుకు హాజరైన నిపుణులు స్పష్టం చేశారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 4 వరకూ హైదరా బాదులో నిర్వహించిన ఈ సదస్సులో భాగం గా వారు నానా టికీ పెరుగుతున్న అలర్జీ కేసులకు తగిన చికిత్స అందించడం లో అలర్జీ స్పెషలిస్టులు కీలక పాత్ర పోషించాలని నైపుణ్యాన్ని సంతరించుకోవాల్సి ఉంటుందని నిపుణులు వివరించారు. ముందుగా రీజనల్ సిఈఓ, ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ కెటి,దేవానంద్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్ షాపుల ద్వారా వైద్యులు తమ తమ అనుభవాలను పంచుకొంటూ రోగులకు అందుచే చికిత్స ఏ మేరకు లాభం చేకూర్చేలా అలాగే రోగికి మేరుగైన చికిత్స అందించడానికి వీలవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఏపీసీఓఎన్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఆస్టర్ ప్రైమ్ వైద్యులు పల్మనాలజిస్తు, అలర్జీ వైద్య నిపుణులు, స్లీప్ డిజార్డర్ స్పెషలిస్టు డా.వ్యాకరణం నాగేశ్వర్ మాట్లాడుతూ అలర్జీ వ్యాధులకు నాణ్యమైన, ఖచ్చితమైన చికిత్స అందిం చడానికి రోగికి సంబంధించిన మూడు తరాల చరిత్రను తెలుసుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. పఖ్యాత అలర్జీ వైద్య నిపుణులు డా.పి కె వేదాంతం మాట్లాడుతూ రోగి యొక్క అలర్జీ లక్షణాలను ఖచ్చితమైన కారణాలను గుర్తించ డానికి అలర్జీ స్కిన్ ప్రిక్ టెస్టులు ఎంతగానో ఉపయోగ పడుతాయని చెప్పారు. పలువురు వైద్య నిపుణులు డా. సుబ్రమణ్య నటరాజన్, వల్లభబాయి పటేల్ చెస్ట్ ఇన్సిస్టి ట్యూట్ డైరెక్టర్,డాక్టర్ రాజ్ కుమార్, మాట్లాడుతూ అలర్జీ కేసులు పెరగడానికి ప్రధానంగా పెరుగు తున్న కాలుష్యం కారణమని చెప్పారు. ఇంట్రాలింఫటిక్ ఇమ్యూనోథెరపీ విధానాన్ని భారత దేశంలో అలర్జీ చికిత్సకు వినియోగించేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.

# విదేశాల్లో విద్యకు గ్రాడ్‌రైట్ సులభ మార్గం

## ఎనిమిది దేశాల యూనివర్శిటీలతో జట్టు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే వారికి గ్రాడ్‌రైట్ సులభ మార్గాలను సూచిస్తుందని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు శశిధర్ సిస్టా, అమన్ సింగ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'షిఫ్టెడ్ 2023 కాన్‌క్లేవ్‌లో వారు మాట్లాడుతూ.. భారత్ నుంచి అమెరికా వెళ్లి విద్యను అభ్యసిస్తున్న వారిలో 30 శాతం మంది తెలుగు వారేనని తెలిపారు. విదేశాల్లో విద్యా వివరాలు, ప్రవేశాల కోసం దేశంలో అనేక కన్సల్టెన్సీలు పని చేస్తున్నాయని.. కానీ తమ ఎడ్-ఫిన్‌టెక్ స్టార్టప్ వినూత్నంగా విద్యార్థికి కావాల్సిన పూర్తి సమాచారం అందిస్తుందన్నారు. ”విద్యార్థి ప్రస్తుతం చదువుతున్నదానికి ఏ దేశంలో, ఏ యూనివర్శిటీలో ఎలాంటి కోర్సుకు అర్హుడు. భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ఎంత వేతనం పొందవచ్చనే వివరాలు అందుబాటులో ఉంటాయి. అదే విధంగా విదేశీ యూనివర్శిటీల్లో చదువుకు కావాల్సిన వ్యయాలకు రుణాలను అందించడానికి పలు విత్త సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నాం. ఒకే వేదికపై యూనివర్శిటీ వివరాలు, కోర్సులు, విద్యా రుణం తదితర సేవలను అందిస్తున్నాం.”అని శశిధర్ సిస్టా తెలిపారు. ఎనిమిది దేశాల్లోని యూనివర్శిటీలతో భాగస్వామ్యం కలిగి ఉన్నామన్నారు. రాబోయే మూడేళ్లలో 3 లక్షల మంది భారతీయ విద్యార్థులకు ప్రపంచంలోని అగ్రశ్రేణి 500 విశ్వవిద్యాలయాల్లో సరసమైన ధరల్లో ప్రవేశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం తాము అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్ తదితర దేశాల్లోని యూనివర్శిటీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో తాము తొలుత కార్యాలయం తెరిచామని.. మరో ఆఫీసును గూర్‌గావ్‌లో ఏర్పాటు చేస్తున్నామని త్వరలోనే అమెరికాలోనూ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు.

# మావోయిస్టు పార్టీ సాంకేతిక నిపుణుల టీం సభ్యులు అరెస్ట్

## రామగుండం పోలీస్ కమిషనర్ రెమారాజేశ్వరీ వెల్లడి

రామగుండం- ప్రభాత సూర్యుడు



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల జోన్ జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారంలో నిషేధిత సీపీఐ(మావోయిస్టు) టెక్నికల్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ టెక్నికల్ టీం క్యాడర్ సభ్యులు ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీపీ రెమారాజేశ్వరి తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డెల్టా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన డి.గంగాధర రావు 1969లో వైజాగ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ చదివారు. 1972లో జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి అక్కడే ఓ ప్రయివేటు కంపెనీలో చేరారు. 1980 వరకు అక్కడే పని చేసిన గంగాధరరావు మావోయిస్టు పార్టీ సిటీ కమిటీ ఆర్గనైజర్ విశ్వం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడ్డాక అందులో చేరారు. ఈయనకు డీవీసీఎం సీపీఐఎం డీకేఎస్‌జెడ్‌సీ-సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యురాలు భవానితో వివాహమైంది. వీరికి ఒక కూతురు ఉంది. ఈ నేపథ్యంలో మావోయిసుటపార్టీ కేంద్ర కమిటీ గంగాధరరావుకు 2000లో సాంకేతిక విభాగం బాధ్యతలు అప్పగించగా ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీ చేసేవాడు. పది నెలల కిందట కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న ఆదేశాల మేరకు ఆయన భార్య భవానితో కలిసి మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం వచ్చారు. జాలంపెల్లి బక్కయ్య, జాలంపెల్లి లక్ష్మీ పేర్లతో నకిలీ ఆధార్ కార్డులు, పాన్ కార్డులు తయారు చేసి, ఆ పేర్లతో ఇందారంలో స్థలం కొనుగోలు చేసి చిన్న ఇల్లు నిర్మించుకున్నారు.

**ఇందారం నుంచే కార్యకలాపాలు**

దంపతులిద్దరూ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సిరొంచకు వెళ్లి, మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్, బండి ప్రకాష్, బడే చొక్కారావు, ఏ.దామోదర్‌తో కలిసి పార్టీ సమావేశాలకు హాజరయ్యేవారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన విషయాలను వారితో వాట్సాప్‌లో చర్చించేవారు. తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, రాష్ట్రాల్లో రెండు మూడు సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలాపాలు నిర్వహించారు. కొద్ది నెలల కిందట ఇందారం గ్రామానికి రాగా పక్కా సమాచారం మేరకు పోలీసులు వారిని అరెస్టు చేశారు. వీరికి సాయం చేసిన సీపీఐ మావోయిస్టు సానుభూతిపరుడైన కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన చిప్పకుర్తి శ్రీనివాస్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతనికి కోసం పోలీసుల ప్రత్యేక బృందం గాలిస్తోంది. పట్టుబడిన వీరిపై జైపూర్ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారి నుంచి నకిలీ ఆధార్, పాన్‌కార్డులు, బ్యాంక్‌పుస్తకాలు, ఒక మొబైల్ ఫోన్, 6 మెమోరీ కార్డులు, ఒక ట్యాబ్, రెండు పెన్ డ్రైవ్‌లు, ఒక పాకెట్ డైరీ, ఒక పెన్, రెండో సెషన్ రిజల్యూషన్‌లు, తెలంగాణ రాష్ట్ర రెండో ప్లీనరీ తీర్మానాలు స్వాధీనం చేసుకున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215